క్లుప్తంగా

చీఫ్ సెక్రటరీ దృష్టికి ఏపీ పీటీడీ ఉద్యోగుల సమస్యలు



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

మద్దిలపాలెం: ఏపీ పీటీడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు తెలిపారు. కొన్నేళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనను వినతిపత్రంలో కోరామన్నారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ ఎస్‌ఎంయూఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్‌లో ఢీకొన్న కారు, బైక్

ఆరిలోవ : బీఆర్‌టీఎస్‌లో ఒకే లైన్‌లో ఎదురెదురుగా వస్తున్న ఓ కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీఆర్‌టీఎస్‌లో హనుమంతవాక నుంచి సింహాచలం వైపు ఓ కారు వెళ్తోంది. పైనాపిల్‌కాలనీ నుంచి హనుమంతవాక వైపు ఓ యువకుడు రాంగ్ రూట్‌లో అదే లైన్‌లో వెళ్తున్నాడు. ఈ రెండు వాహనాలు ఒకదానికొకటి ఎదురుగా విశాఖ కేంద్ర కారాగారం సమీపంలోని రామకృష్ణాపురం ఎదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్ నడుపుతున్న యువకుడు కిందపడటంతో తలకు తీవ్ర గాయమైంది. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జయ్యాయి. విషయం తెలుసుకున్న ఆరిలోవ ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని కారు, బైక్‌ను పక్కకు తొలగించారు. అంతవరకు అక్కడ నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఆరిలోవ లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేశారు. గాయాలైన యువకుడిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ కుమార్ తెలిపారు.

ఆర్కే బీచ్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న ఉద్యోగులు

ఎంవీపీకాలనీ: విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా పంజాబ్ నేషనల్ బ్యాంకు ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రజలను చైతన్య పరిచారు. ఆర్కే బీచ్‌లో కరప్షన్‌ఫ్రీ భారత్ పేరిట బుధవారం ఉదయం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బ్యాంక్ సర్కిల్ హెడ్ నీలిమ మాట్లాడుతూ అవినీతి కారణంగా ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. దీని ప్రభావం దేశ అభివృద్ధిపై పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో అవినీతి రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీసీ హెడ్ ప్రదీప్ జంబాల, డిప్యూటీ హెడ్ మనోజ్ సేత్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీసీ సంఘం నాయకులు



సీపీ రవిశంకర్‌ను సత్కరిస్తున్న బీసీ నాయకులు

ఎంవీపీకాలనీ : రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు, బీసీ స్టడీ సర్కిల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, విశాఖ బీసీ స్టడీ సర్కిల్ పూర్వ మేనేజర్ ఇల్లా వెంకటేశ్వరరావు బుధవారం ఉదయం పోలీసు కమిషనర్ రవిశంకర్‌ను కలిసి సంఘం తరఫున సత్కరించారు. ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ సుదీర్ఘ పాలన అనుభవం ఉన్న రవిశంకర్‌ను విశాఖ సీపీగా నియమించడం అభినందనీయమన్నారు. పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగం.. అజరామరం



తెలుగు తల్లి విగ్రహం వద్ద నినదిస్తున్న తెలుగు దండు బృందం సభ్యులు

- పొట్టి శ్రీరాములుకు పలువురి నివాళి
- వేడుకగా రాష్ట్రావతరణ దినోత్సవం



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధ్యాపక బృందం

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి, ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ భాషా ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడటానికి ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగాన్ని నేటితరం యువత మరువరాదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎస్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు. విద్యా విభాగంలో కూడా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమాలు, పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం తదితర విషయాలను విద్యార్థులకు వివరించారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం : రాష్ట్రావతరణ దినోత్సవాన్ని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు, అధ్యాపకులు సూర్యనారాయణ, రూపారాణి, ధనలక్ష్మి, కె.రవిబాబు పోలా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లి విగ్రహం వద్ద..

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మద్దిలపాలెం తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగుదండు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదండు వ్యవస్థాపక కార్యదర్శి సూరి, ఆడారి కిషోర్, శేఖర్ మంత్రి ప్రభాకర్, నాంచారయ్య, కళాకారులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

హెల్త్ సిటీలో బడ్డీలు ఏర్పాటు చేస్తే చర్యలు



హెల్త్‌సిటీలో రోడ్డు పక్కన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మూసేసిన బడ్డీలు

ఆరిలోవ: హెల్త్‌సిటీలో రోడ్ల పక్కన అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలను టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం పూర్తిగా మూయించేశారు. హెల్త్ సిటీలోని రహదారులకు ఇరువైపులా మూడుచోట్ల సుమారు 10 బడ్డీలు వెలిశాయి. కొందరు ఆ బడ్డీలకు అనధికారికంగా విద్యుత్ మీటర్లు కూడా అమర్చారు. విద్యుత్ విభాగం అధికారులు ఏ ఆధారం లేకుండా ఆయా బడ్డీలకు విద్యుత్ మీటర్లు అమర్చడంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు విస్తుపోతున్నారు. ఇక్కడ బడ్డీలు నిర్వహించడం వల్ల ఆస్పత్రులకు వెళ్లే రోగుల వాహనాలకు ఆటంకంగా ఉందని, టీ కప్పులు, ప్లాస్టిక్ సంచులు, గ్లాసులతో రోడ్లు అస్తవ్యస్తమవుతున్నాయని హెల్త్‌సిటీ వైద్యుల కమిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన అధికారులు రెండు రోజుల క్రితం బడ్డీల నుంచి విద్యుత్ కనెక్షన్లను తొలగించేశారు. అనంతరం బడ్డీలను మూయించారు. మరెప్పుడూ బడ్డీలు తెరవొద్దని నిర్వాహకులను హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



ఆర్‌ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

మద్దిలపాలెం : సమస్యల పరిష్కారం కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌ఎం కార్యాలయం ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి మాట్లాడుతూ 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. అసోసియేషన్ సభ్యులపై అధికారులు పక్షపాతం విడనాలన్నారు. డిపో స్పేర్ నుంచి లిఫ్ట్ అయిన వారిని అదే డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటీ, డే అవుట్ అలవెన్స్ అదే నెల జీతంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓఆర్ తక్కువ వచ్చిందనే నెపంతో వేరొక డిపోకు బదిలీ చేసే విధానం విడనాడాలన్నారు. రీజనల్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, గాజువాక డిపో కార్యదర్శి పి.శంకరావు, పీపీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

బయో కెమిస్ట్రీ విభాగానికి నూతన సొబగులు



నూతన విభాగాన్ని ప్రారంభిస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విభాగాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే విధంగా ఏయూ అధికారులు పని చేస్తున్నారు. దీనిలో భాగంగా విభాగంలో విద్యార్థులకు ఉపయుక్తంగా పలు మౌలిక సదుపాయాలు కల్పించారు. బుధవారం విద్యార్థులతో ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ప్రారంభింపజేశారు. అనంతరం వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్సిటీలోని ప్రతి విభాగాన్ని, ప్రతి భవనాన్ని పూర్తిస్థాయిలో బలోపేతం చేసే విధంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఫార్మసీ ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్రప్రసాద్, బయో కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణిదేవి, విభాగ ఆచార్యులు టి.రాఘవరావు, పి.రాధిక, పి. అపరంజి, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భవనం బలోపేతం.. బయో కెమిస్ట్రీ విభాగ భవనం పూర్తిగా రాతితో నిర్మితమైనది. దీనిని పరిరక్షించే విధంగా అవసరమైన మరమ్మతులు చేపట్టారు. భవనం చుట్టూ ఉన్న సన్‌షేడ్ శిథిలం కావడంతో దాని స్థానంలో కొత్తది నిర్మించారు. విద్యార్థులకు నూతన ఎల్‌సీడీ, యూపీఎస్ అందించారు. భవనాన్ని సుందరంగా రంగులతో తీర్చిదిద్దారు. భవనం చుట్టూ యూజీడీ వ్యవస్థను నూతనంగా నిర్మించారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

రైలు ప్రమాదాలకు కేంద్రం నిర్లక్ష్యమే కారణం



సమావేశంలో మాట్లాడుతున్న సిటు ఆలిండియా అధ్యక్షురాలు హేమలత

డాబాగార్డెన్స్ : రైలు ప్రమాదాలకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, ఇటీవల కొత్తవలస రైల్వే మార్గంలో కంటకాపల్లి వద్ద జరిగిన రైలు ప్రమాదమే అందుకు నిదర్శనమని సిటు ఆలిండియా కమిటీ అధ్యక్షురాలు కె. హేమలత ఆరోపించారు. విశాఖలో సిటు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉదయం నుంచి ఆటోమేటిక్ సిగ్నల్స్‌లో లోపాలున్నాయని గుర్తించారని, ఈ ప్రమాదానికి ఇదే ప్రధాన కారణమని నిపుణులు భావిస్తున్నారని, ఈ ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు లోకో పైలెట్లు, ఒక గార్డ్‌తో సహా 14 మంది మృతి చెందారన్నారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. రైల్వే అధికారులు అసలు లోపాన్ని వదిలేసి, ప్రమాదంలో చనిపోయిన వారిపై నెపం నెట్టడం అన్యాయమన్నారు. విశాఖ డివిజన్‌లోనే గత దశాబ్దంలో మూడు ఘోర ప్రమాదాలు చోటు చేసుకున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం బాధ్యులైన అధికారులను కాపాడుతుందని మండిపడ్డారు. భద్రతపై నిర్లక్ష్యం, కాంట్రాక్టీకరణ, లోకో రైళ్ల నడపడంలో ట్రైనింగ్ ఇవ్వకపోవడం, ఎక్కువ పని గంటలు లోకో డ్రైవర్లతో పని చేయించడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. రైల్వేలో ఇప్పటికీ 2.7 లక్షల పర్మినెంట్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26,27,28 తేదీల్లో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్ర రాజధానుల్లో అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మహాధర్నాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెండో వారంలో అన్ని రైల్వే స్టేషన్ల వద్ద నిరసన ప్రదర్శనలు చేపడతున్నట్టు తెలిపారు.

అలరించిన లలిత సంగీత విభావరి

సీతంపేట: శ్రీమన్నారాయణ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పద్మభూషణ్ దేవులపల్లి కృష్ణశాస్త్రి 126వ జయంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో లలిత సంగీత విభావరి నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు పోలుకొండ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వి.ప్రభాకర్, త్రినాథ్, భాస్కర్, వరలక్ష్మి, కనకదుర్గ, జాస్మిన్, భారతి, శశిరాణి, జయంతి, సరిత లలిత గీతాలు ఆలపించారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం వైభవంగ4ఆ జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

గణపతికి అభిషేకం

సింహాచలం: సంకటహర చతుర్థిని పురస్కరిచుకుని బుధవారం విజినిగిరిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతికి విశేషంగా అభిషేకం నిర్వహించా రు. అనంతరం స్వామి ని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శ నం కల్పించారు. ఆల య అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ తదితరులు పూజలు నిర్వహించారు.

5న ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరాగాంధీ నగర్ వద్ద ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఈ నెల 5న ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆశ్రమం స్వామీజీ సామ్యానంద్ అవధూత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న శిబిరంలో మధుమేహం, రక్తపోటు, ఈసీజీ, గైనిక్ క్యాన్సర్ గుర్తించే పాప్‌స్మియర్ తదితర పరీక్షలు చేస్తారని తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, అవసరమైన వారు ఆ సమయంలో వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

సేవల్లోనే సంతృప్తి



మాట్లాడుతున్న రమేష్

బీచ్‌రోడ్డు : సేవ చేయడంలో ఉన్న సంతృప్తి మరెందులోనూ లేదని ప్రముఖ వక్త కె.వి.టి రమేష్ అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్లో బుధవారం రాత్రి రోటరీ క్లబ్ విశాఖపట్నం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పోలియో నియంత్రణకు రోటరీ సభ్యుల కృషి అభినందనీయమన్నారు. సేవాభానికి రోటరీ చిరునామా అని కొనియాడారు. ఈ సమావేశంలో క్లబ్ అధ్యక్షుడు డీఎం రావు, కార్యదర్శి రఘుపతి, పూర్వ అధ్యక్షుడు జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కస్టమ్స్ కార్యాలయ ఆవరణలో దుర్గా పూజ

డాబాగార్డెన్స్ : దుర్గాదేవి దయతోనే ప్రపంచ సాధికారత సాధ్యమని కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ పేర్కొన్నారు. విశాఖపట్నం కస్టమ్స్ గ్రూప్–సి ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోర్టు సమీపాన కస్టమ్స్ ఆఫీస్ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏటా అధికారుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కస్టమ్స్ ప్రిన్సిపాల్ కమిషనర్ ఎస్. శ్రీధర్, జీఎస్టీ కమిషనర్ రుషిగోయల్, అడిషనల్ కమిషనర్ ప్రథమేష్, డిప్యూటీ కమిషనర్ ఎం. రవిశంకర్, కమిషనర్ శ్రీరామ్, గ్రూప్–సి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎస్. విశ్వనాథం, లకే చిట్టిబాబు, కె. చార్లెస్, పి. దుర్గరాజు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్లలో మొక్కలు నాటేందుకు చర్యలు



కొత్త రోడ్డు డివైడర్‌లో మొక్కల కోసం యంత్రాలతో గోతులు తవ్వుతున్న సిబ్బంది

ఆరిలోవ: నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల మధ్య డివైడర్లలో పచ్చదనం కోసం జీవీఎంసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో బీఆర్‌టీఎస్, కొత్తగా నిర్మించిన రహదారుల మధ్య డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీని కోసం రెండు రోజులుగా డివైడర్ల మధ్య యంత్రాలతో గోతులు తీయిస్తున్నారు. హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్‌లో రెండు డివైడర్లు, ఇటీవల కొత్తగా నిర్మించి చినగదిలి షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజా నగర్ వరకు సుమారు అర కిలోమీటరు రోడ్డు మధ్య డివైడరులో మొక్కలు నాటుతున్నారు. కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో భూమి గట్టిపడి గోతులు తీయడానికి కూలీల వల్ల కావడం లేదు. దీంతో యంత్రాలను ఉపయోగించి గోతులు తీయిస్తున్నారు. ఈ పనులు పూర్తయి, మొక్కలు వేస్తే ఈ ప్రాంతం పచ్చదనంతో కనువిందు చేయనుంది.

ఏయూ సమాచారమ్

నేటి నుంచి అధ్యాపకుల సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఐసీటీ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమ పోస్టర్‌ను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఐడియా జనరేషన్ మెథడ్స్ అంశంపై గురువారం నుంచి మూడురోజుల పాటు వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఈ సదస్సును నిర్వహిస్తారు. సదస్సుకు ఏయూ అనుబంధ కళాశాలకు చెందిన 170 మంది అధ్యాపకులు హాజరవుతున్నారు. పోస్టర్ ఆవిష్కరణలో కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్‌రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్‌కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ ప్రగతిలో భాగస్వాములు కావాలి

- ఉద్యోగులతో వీసీ ప్రసాదరెడ్డి



ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రగతిలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. త్వరలో ఏయూను నాక్ కమిటీ సందర్శిస్తుందని, కమిటీ అందించే ర్యాంక్ రానున్న ఆరు సంవత్సరాలకు ఏయూకి ఎంతో కీలకంగా నిలుస్తుందన్నారు. త్వరలో శతాబ్ది వేడుకలకు సిద్ధమవుతున్న ఏయూ మరింత శోభాయమానంగా అన్ని రంగాలలో ప్రగతి సాధించాలన్నారు. దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ఏయూ ఓపెన్ ఎయిర్ థియేటర్‌ని దాతల సహకారంతో పూర్తిస్థాయిలో ఆధునికీకరించామన్నారు. ఈ నెల 22న సినీ నటుడు అక్కినేని నాగార్జున దీనిని ప్రారంభిస్తారన్నారు. ఇదే వేదికపై 1960లో కులగోత్రాలు సినిమా చిత్రీకరణ జరిగిందని, ఆ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు నటించారన్నారు.

విశ్వవిద్యాలయం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో విభిన్న నూతన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఏయూలో స్థాపించిన ఇంక్యుబేషన్ సెంటర్‌లో 124 సంస్థలు పని చేస్తున్నాయన్నారు. ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఎలిమెంట్ వంటివి భవిష్యత్తులో వర్సిటీకి ఆదాయ వనరులుగా నిలుస్తాయన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వద్ద నూతనంగా చెరువు తవ్వించామని, దీనిని చినజీయర్ స్వామి ప్రారంభిస్తారన్నారు. త్వరలో భౌతిక శాస్త్ర విభాగాన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరిస్తామని, నాలుగు లేన్ల రహదారి నిర్మాణం చేపడతామన్నారు. శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్ భవనాలను గుర్తించి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో తక్కువ సమయంలో మరమ్మతు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఎ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విభాగంలో ప్రభావతికి డాక్టరేట్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో చదరం ప్రభావతికి డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు ఆర్.రంగనాథ్, డాక్టర్ టి.షారోన్‌రాజు సంయుక్త పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆఫ్ ద ఫేక్టర్స్ ఎఫెక్టింగ్ జువైనల్ డెలిక్వెన్సి–ఎ కేస్ స్టడీ ఆఫ్ విశాఖపట్నం డిస్ట్రిక్ట్' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ప్రభావతి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు. విశాఖ జిల్లాలోని బాల నేరస్తులపై అధ్యయనం చేయడం పట్ల పరిశోధకురాలని అభినందించారు.

రూ.78.61 లక్షలతో గోకుల్ పార్క్ అభివృద్ధి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : తీర ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్–4 పరిధి 29వ వార్డు బీచ్‌రోడ్డు గోకుల్‌పార్క్‌ను సుమారు రూ.78.61 లక్షలతో చేయనున్న అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ ఉరుకుటి నారాయణరావుతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరానికి సువిశాల తీర ప్రాంతం ఉందని, ఎంతో మంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తూ ఉంటారని, వారికి ఆహ్లాదం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ తీర అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని, ఆ దిశగా పనులు జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో విశాఖపట్నం పరిపాలన రాజధాని అవుతున్న దృష్ట్యా విశాఖ నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, ఎంతో మంది పర్యాటకులు, సందర్శకులు నగరానికి వస్తుంటారని, వారికి ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.19.45 లక్షలతో పీఠంతో కూడిన కాలియా స్నాక్ మోడల్‌తో శ్రీకృష్ణ భగవానుని ప్రతిష్టాపన, రూ.19.93 లక్షలతో పెడస్టల్‌తో శ్రీకృష్ణ భగవానుని మోడల్ ఇన్‌స్టాలేషన్, రూ.19.60 లక్షలతో వాకింగ్ ట్రాక్, గోకుల్ పార్క్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజినీరు సత్యనారాయణ, పార్టీ నాయకులు పీతల వాసు, సనపల రవీంద్రభరత్, ఆదివిష్ణు, రాజాపాత్రుడు, కంచర్ల రవి, సురేష్, మహేష్, సతీష్, శ్రీనివాస్, వెంకటరమణ, రాజు, శ్రీను, కనకరాజు కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నవ కవులకు మార్గదర్శి శ్రీశ్రీ



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజం కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వం ఉత్తమ విలువలతో కూడినదై సమాజ ఉన్నతికి దోహదపడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔత్సాహిక కవులు పూర్వ కవుల రచనలు ఎక్కువగా చదవాలని, నవ కవులకు మార్గదర్శి మహాకవి శ్రీశ్రీ అని తెలిపారు. నేటి నవ కవులందరూ శ్రీశ్రీ సాహిత్యాన్ని చదవాలని సూచించారు. డాక్టర్ కె.జి.వేణు తెలంగాణ ప్రజాకవి గూడ అంజయ్య జీవితం, సాహిత్యం గురించి ప్రసంగించారు. డాక్టర్ డి.వి. సూర్యారావు మాట్లాడుతూ కవి అంటే కృష్ణశాస్త్రి అని, ఆయన భవకవిత్వానికి ఆద్యుడని, సంస్కారవంతమైన కవిత్వం రాశారని తెలియజేశారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో రామతాత నీలి మేఘాలలో కవిత, కుమారి ఆశ్రిత ఎందుకీ ఊగిసలాట కవిత, కె.వి.ఎస్.మూర్తి లోకం పోకడ కవిత, కొత్తూరి రమణ పల్లె పడుచు కవిత, చిన సూర్యనారాయణ సమైక్య హృదయ సంస్కారం కవిత, రమణమూర్తి పులిలా కవిత చదివి వినిపించారు.